క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ టీచర్స్ కాలనీ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులలో భాగంగా పలు ప్రాంతాల్లో శనివారం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ పి. రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు టీచర్స్ కాలనీ, అప్పాబజార్ రోడ్డు, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, దర్గా ప్లాట్స్, హౌసింగ్ బోర్డ్ కాలనీలోని 450–300 ఎస్ఎఫ్టీ బ్లాక్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

శ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో శుక్రవారం తెల్లవారుజామున సుప్రభాత సేవ, అనంతరం స్వామి వారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, తులసీదళ అర్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు వినుకొండ రత్నమాచార్యుల శిష్యబృందం స్వామి వారికి పూజా కార్యక్రమాలను జరిపించింది. దేవస్థాన కమిటీ కార్యదర్శి మరుపిళ్ల హనుమంత రావు, కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

అన్నదానం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఈద్ మిలాదున్నబీ పర్వదినాన పురస్కరించుకొని వించిపేటలోని మహబూబ్ సుభాని జెండా చెట్టు దర్గా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ హస్సేన్ బాషా (బాషి) ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదానాన్ని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈద్‌మిలాదున్నబీ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. ముస్లిం సోదరులకు విందును వడ్డించారు. మిలాదున్ నబీ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇంజినీరింగ్ పనులు సకాలంలో పూర్తి కావాలి: ఈఓ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన ఇంజినీరింగ్ పనులు సకాలంలో పూర్తి కావాలని దుర్గగుడి ఈఓ శీనానాయక్ అధికారులను ఆదేశించారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న పలు ఇంజినీరింగ్ పనులను ఈఓ శీనానాయక్, ఈఈ రాంబాబు, ఇతర అధికారులు శుక్రవారం పరిశీలించారు. మహామండపం ఎదుట నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనం, ప్రసాదాల పోటు, కనకదుర్గా నగర్‌లో లడ్డూ ప్రసాద విక్రయ కౌంటర్లను పరిశీలించారు. నూతన భవనాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థను పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈఈ రాంబాబు, ఏఈ మస్తాన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

విశేష అలంకారంలో బాలగణపతి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని బాలగణపతి విశేష అలంకారంలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. పాతబస్తీ పూజారి వారి వీధిలోని బాలగణపతి దేవస్థానంలో కొలువై ఉన్న స్వామి వారు శయనగణపతిగా, మధ్యాహ్నం నుంచి విశేష అలంకారంలో గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఉభయ దాతలకు, దాతలకు నిర్వాహకులు అన్నసమారాధన నిర్వహించారు. సహస్ర మోదక పూజలో ఆతుకూరి రాంబాబు, శ్రీదేవి దంపతులు పాల్గొన్నారు. అన్నప్రసాద వితరణ చేశారు.

వైభవంగా పూర్ణాహుతి

స్వామివారి ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి మామిడి వెంకటకృష్ణారావు దంపతులు ఉదయం జరిగిన హోమంలో పాల్గొని పూర్ణాహుతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎంవీ సుధాకర్, కేఎస్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వణుకుతున్న పాత ఆర్ఆర్‌పేట

- జ్వరాల విజృంభణ
- ప్రతి ఇంట్లో జ్వర బాధితులు
- ఆస్పత్రుల చుట్టూ రోగుల ప్రదక్షిణలు
- పట్టించుకోని అధికారులు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): పాత ఆర్ఆర్‌పేటలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇంటికి ఒకరు, ఇద్దరు చొప్పున జ్వరాలతో బాధపడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేటు ఆస్పత్రులు నిత్యం జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. పాత ఆర్ఆర్‌పేటలో ఉన్న ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న వర్షం నీటిలో దోమలు వృద్ధిచెంది జ్వరాల వ్యాప్తికి కారణమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.



పాత ఆర్ఆర్‌పేటలో పిచ్చిమొక్కలతో నిండిన ఖాళీ స్థలం

అధికంగా ఖాళీ స్థలాలు

స్థానిక 56వ డివిజన్ పాత ఆర్ఆర్‌పేటలో అధికంగా ఉన్న ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి. వర్షం నీరు నిల్వ ఉండటంతో దోమలకు అవి ఆవాసాలుగా మారాయి. గత ఏడాది వచ్చిన బుడమేరు వరద ముంపునకు నెల రోజులపాటు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ ఏడాది కురిసిన వర్షాలతో జ్వరాల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ వేలాది రూపాయలు ఖర్చుచేయాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

డివిజన్ ప్రజలు జ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నా ఆరోగ్య శాఖాధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఇంట్లో ఒకరు, ఇద్దరు చొప్పన జ్వరాలతో బాధపడుతున్నారని, పేద



జ్వరంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి

కుటుంబాలు కావడంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లలేక స్థానికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. చికిత్స చేసేందుకు వైద్యులు, రక్త పరీక్షలు చేసేందుకు సిబ్బంది అందుబాటులో లేరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కనిపించని మలేరియా సిబ్బంది

గతంలో మలేరియా సిబ్బంది ఇంటింటికి వచ్చి జ్వరాలతో బాధపడే వారి నుంచి రక్త నమూనాలను సేకరించి మలేరియాగా నిర్ధారణ అయితే వారికి మందులను అందజేసేవారు. ప్రస్తుతం వారు కనిపించడమే కరువైందని స్థానికులు మండిపడుతున్నారు. కనీసం ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు కూడా ఇళ్ల వద్దకు రావడం లేదని విమర్శిస్తున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి యోగక్షేమాలు అడిగి తెలుసుకునేవారు. జ్వరాలు, ఇతర వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి మందులను అందించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చేవారు. అవసరమైతే పెద్ద ఆస్పతికి తరలించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో బాధితులు మెడికల్ షాపుల వద్ద మందులు కొని వాడుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డివిజన్‌లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్యం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

15 రోజులుగా బాధపడుతున్నా..



గత పదిహేను రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నా. న్యూ ఆర్ఆర్‌పేటలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లినా జ్వరం మాత్రలు ఇచ్చి పంపిస్తున్నారు కాని ఎటువంటి రక్త పరీక్షలు చేయలేదు. దీంతో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చింది. అక్కడకు వెళ్లే సీజనల్ ఫీవర్ అని చెప్పి మందులు ఇచ్చారు.

– జయమ్మ, ఆర్ఆర్ పేట

వైభవంగా శ్రీవారి కల్యాణం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని బ్రాహ్మణవీధిలో దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి శుక్రవారం శాంతి కల్యాణాన్ని ఆలయ అర్చకస్వాములు పి.రామచంద్రమూర్తి పర్యవేక్షణలో నేత్రపర్వంగా నిర్వహించారు. విష్వక్సేన పూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మహాసంకల్పం, ప్రవర, యజ్ఞపవీతధారణ, జీలకర్ర బెల్లం ధారణ, మాంగళ్యధారణ, చివరిగా తలంబ్రాల సమర్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. భక్తులు స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం

ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌కు తిరుమంజన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో స్వామి వారిని అభిషేకించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకారం చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు.

శాంతిని ఆకాంక్షించేదే ఇస్లాం

- ఘనంగా మిలాద్–ఉన్–నబీ
- పాతబస్తీలో ముస్లింల భారీ ప్రదర్శన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సర్వమానవాళిలో శాంతి వర్ధిల్లాలని ఆకాంక్షించేదే నిజమైన ఇస్లాం అని పలువురు ఇస్లాం మత గురువులు అన్నారు. మిలాద్–ఉన్–నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈద్ మిలాద్ ఉన్ నబీ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పాతబస్తీలో ముస్లింలు భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక వించిపేట మసీదు సెంటర్ నుంచి కెనాల్ రోడ్డులోని జామా మసీదు వరకు ప్రదర్శన సాగింది. కమిటీ అధ్యక్షులు సయ్యద్ సలీముద్దీన్ నేతృత్వంలో ప్రారంభమైన ఈ ప్రదర్శనలో నగరం నలుమూలల నుంచి భారీగా ముస్లింలు తరలివచ్చారు. ఇస్లాం మత చిహ్నాలను, కట్టడాల నమూనాలను ప్రదర్శిస్తూ ముస్లిం యువత ఈ ప్రదర్శనలో పాల్గొంది. ఇస్లాం మత చిహ్నాలతో కూడిన పతాకాలను చేబూని ఉత్సాహంగా ప్రదర్శనలో ముందుకు సాగారు. మహ్మద్ ప్రవక్త బోధనలను స్మరించుకుంటూ చిన్నారులు, వృద్ధులు సంప్రదాయ వస్త్రధారణతో ప్రదర్శనలో పాల్గొన్నారు,

మానవుల శ్రేయస్సును ఆకాంక్షించాలి

పలు ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లిం మత గురువులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తోటి మానవుల శ్రేయస్సును ఆకాంక్షించాలన్నారు. పేదల ఆకలి దప్పికలను గుర్తించి వారికి అండగా ఉండాలని ఇస్లాం చెబుతోందన్నారు. మహ్మద్ ప్రవక్త ప్రపంచానికి గొప్ప సందేశాన్నందించారని, దానిని అందరూ ఆచరించినప్పుడు సమాజంలో శాంతి నెలకొంటుందని వివరించారు. అధ్యక్షుడు సయ్యద్ సలీముద్దీన్ మాట్లాడుతూ చిట్టచివరి దైవప్రవక్త



ప్రదర్శనలో ముందు భాగంలో ఇస్లాం మత గురువులతో వెలంపల్లి శ్రీనివాసరావు

బోధించిన బోధనలను అందరూ ఆచరించాలన్నారు. విశ్వశాంతిని కాంక్షిస్తూ గడిచిన 27 సంవత్సరాలుగా ఈ పర్వదినం రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. జామా మసీదు ప్రాంగణంలోని ప్రవక్త కేశాన్ని ముస్లింలు దర్శించుకున్నారు. కార్యక్రమాన్ని కమిటీ కార్యదర్శి మహ్మద్ యూనస్ నిర్వహించారు. ప్రదర్శనలో ఎంపీ కేశినేని చిన్ని, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నతో పాటుగా వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలి : వెలంపల్లి

మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజైన మిలాద్–ఉన్–నబి సందర్భంగా అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న ఆయన మతగురువులను సత్కరించి అభినందించారు. వెలంపల్లి మాట్లాడుతూ సమాజంలో అందరూ బాగుండాలని, ప్రపంచంలో శాంతి వర్ధిల్లాలని ఇస్లాం చెబుతుందన్నారు. అటువటి బోధనలను అందరూ ఆచరించాలని సూచించారు. పలువురు మైనార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



ఇస్లాం చిహ్నాలు, కట్టడాల నమూనాలను ఊరేగిస్తున్న ముస్లిం యువకులు

ముసాఫిర్‌ఖానా ప్రైవేటీకరణ దుర్మార్గం : వెలంపల్లి





సంతకాలు చేస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు, పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వక్ఫ్‌బోర్డుకు చెందిన ముసాఫిర్‌ఖానాను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పేద ముస్లింలకు సేవలందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ముసాఫిర్‌ఖానాను ప్రైవేటీకరణ చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం ముస్లిం సమాజంపై వివక్షతను ప్రదర్శిస్తోందని చెప్పారు. స్థానిక పంజా సెంటర్ వద్ద అంజుమన్ ఇస్లామియా కమిటీ ఆధ్వర్యంలో షా జహూర్ ముసాఫిర్ ఖానా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని ముసాఫిర్‌ఖానా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అంజుమన్ ఇస్లామియా చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ప్రజల వద్ద నుంచి సంతకాలను సేకరించారు. వెలంపల్లి మాట్లాడుతూ పేద ముస్లిం మైనారిటీ ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ముసాఫిర్‌ఖానాను లీజు పేరుతో ప్రైవేటీకరణ చేసి పేద ముస్లిం ప్రజలకు అందబాటులోకి లేకుండా చేయడం చాలా బాధాకరమన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ముసాఫిర్ ఖానా నిర్మాణం ఆగిపోతే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించిందని చెప్పారు. పేద ముస్లింలకు అందుబాటులో ఉండేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముసాఫిర్ ఖానాను నిర్మించారన్నారు. ముసాఫిర్‌ఖానాను ప్రైవేటీకరణ చేస్తే తమ పార్టీ తరపున ముస్లింలతో కలిసి ఉద్యమాలు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ముసాఫిర్ ఖానా ప్రైవేటీకరణ విషయంలో తమ వైఖరిని మార్చుకోవాలని చెప్పారు. కాంట్రాక్టర్లకు మేలు చేయటానికే.. పోతిన మహేష్ తమకు కావాల్సిన కాంట్రాక్టర్లకు మేలు చేయటానికే ముసాఫిర్ ఖానాను ప్రైవేటీకరణ చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ విమర్శించారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రియాజ్‌అహ్మద్, అజీజ్ అహ్మద్, అబ్దుల్ రెహమాన్, మహమ్మద్ వజీర్, ఇంతియాజ్ బాషా, ఎండీ సలాం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మిలాద్ ఉన్ నబీ ప్రత్యేక ప్రసంగాలు



వెలంపల్లిని సత్కరిస్తున్న కమిటీ ప్రముఖులు.



మత గురువులను సత్కరిస్తున్న షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహ్మద్ అలీ యంగ్ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో మిలాదున్నబి పర్వదినాన్ని పురస్కరించుకొని పంజా సెంటర్‌లో నెల రోజులుగా కొనసాగుతున్న ప్రత్యేక ప్రసంగాలు గురువారం అర్ధరాత్రి ముగిశాయి. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రవక్త పుట్టినరోజుకు సంబంధించి దేశం నలుమూలల నుంచి వచ్చిన పలువురు ఇస్లాం మత గురువులు నెల రోజులుగా రాత్రి వేళల్లో ప్రత్యేక ఉపన్యాసాలు ఇచ్చారు. ముగింపు కార్యక్రమానికి వెఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎదుటివారిపట్ల ప్రేమ, కరుణ కలిగి ఉండాలన్న మహ్మద్ ప్రవక్త బోధనలు చెబుతున్నాయన్నారు. ఈ సందర్భంగా కమిటీ వెలంపల్లిని సత్కరించారు.

ప్రవక్త చూపిన బాటలో నడవాలి: షేక్ ఆసిఫ్

మహ్మద్ ప్రవక్త చూపిన బాటలో అందరూ నడవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్ అన్నారు. ప్రత్యేక ప్రసంగాల ముగింపు కార్యక్రమంలో షేక్ ఆసిఫ్ మతగురువులను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ మిలా ఉన్ నబీ పర్వదినం అందరికీ మేలు చేయాలని అంకాక్షను వ్యక్తం చేశారు.

దోమకాటు వ్యాధులపై అవగాహన ర్యాలీ



పటమట(విజయవాడతూర్పు):దోమకాటు వ్యాధులపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని వీఎంసీ ప్రజారోగ్య సిబ్బంది తెలిపారు. ఫ్రైడే డ్రై డే సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలతో ప్రజారోగ్య, మలేరియా సిబ్బంది బయాలజిస్ట్ కామేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం అయోధ్యనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్, మలేరియా, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ముంపు నుంచి నగరాన్ని కాపాడేందుకు రూ.300 కోట్లు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాధవ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): బెజవాడ గోపాలరెడ్డి, కాకాని వెంకటరత్నం, అయ్యదేవర కాళేశ్వర రావు, డాక్టర్ కేఎల్ రావు వంటి ఎందరో మహనీయులు పుట్టిన గడ్డ బెజవాడ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. అటువంటి విజయవాడకు అనుసంధానంగా ఉన్న వాగులు, ఏరులు అభివృద్ధి చేసి నగరాన్ని ముంపు బారి నుంచి కాపాడేందుకు కేంద్రం రూ.300 కోట్లు నిధులు మంజూరు చేసిందని చెప్పారు. విజయవాడ విద్యాధరపురంలోని ఎస్ కన్వెన్షన్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడకు అవుటర్ రింగ్‌రోడ్డు గేమ్ ఛేంజర్‌గా మారబోతుందన్నారు. ప్రధాని మోదీ అమెరికా బెదిరింపులను పట్టించుకోకుండా ముందుకు వెళుతున్నారన్నారు. విదేశీ వస్తువుల వాడకాన్ని మానేసి స్వదేశీ వస్తువుల వినియోగంతో అమెరికా వంటి దేశాలకు ధీటుగా నిలబెట్టాలని సూచించారు. స్వదేశీ ఉద్యమం ద్వారా భారతదేశం ఆర్థికంగా ఎదుగుతుందని చెప్పారు. పార్టీ రాష్ట్ర నాయకులు నాగోతు రమేష్ నాయుడు, ఉప్పలపాటి శ్రీనివాసరాజు, పాతూరి నాగభూషణం, షేక్ బాజీ, జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, బబ్బూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఆటో డ్రైవర్ దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఆటోడ్రైవర్ దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం కీలేశ్వరానికి చెందిన తోట అరుణ్‌కుమార్ విద్యాధరపురం ఆర్టీసీ డిపోలో బస్సు డ్రైవర్‌గా ఉద్యోగం చేస్తుంటాడు. గురువారం ఉదయం వైఎస్సార్ కాలనీ నుంచి బస్టాండ్‌కు వెళుతుండగా మెయిన్ రోడ్డుపై ఓ ఆటో నిలిపి ఉంది. అరుణ్‌కుమార్ ఆటో వద్దకు వచ్చి హారన్ కొట్టాడు. ఆటోడ్రైవర్ షాహీన్ బస్సులోకి ఎక్కి అరుణ్‌కుమార్‌తో గొడవ పడటమే కాకుండా ముఖంపై, కడుపుపై కొట్టాడు. అరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాతబస్తీలో సందడిగా బీజేపీ శోభాయాత్ర

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బీజేపీ జిల్లా విస్తత కార్యవకర్తల సమావేశాన్ని పురస్కరించుకొని పాతబస్తీలో ఆ పార్టీ శోభయాత్రను శుక్రవారం నిర్వహించారు. వివిధ జానపద కళారూపాలతో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన భాష ఉనికి పెరగడానికి, మన రాష్ట్రం ఏర్పడడానికి ముఖ్య కారణం పొట్టి శ్రీరాములు అన్నారు. భాష పట్ల, రాష్ట్రం పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. మన ప్రాంతంలో పెరిగిన పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రానికి వైతాళికుడిగా పేర్కొన్నారు. విజయవాడకు చెందిన విశ్వనాథ సత్యనారాయణ జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్యను స్మరించుకుంటూ శోభాయాత్ర ముందుకు సాగింది.



శోభాయాత్రలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, నాయకులు

కళాకారుల సేవలను గుర్తించి ప్రోత్సహించాలి

విజయవాడ కల్చరల్: కళాకారుల సేవలను గుర్తించి ప్రోత్సహించాలని శ్రీ రామకృష్ణా నాట్యమండలి వ్యవస్థాపకుడు డాక్టర్ జొన్నలగడ్డ రామ్మోహనరావు అన్నారు. రామకృష్ణా నాట్యమండలి స్వర్ణోత్సవం సందర్భంగా సంగీత సాహిత్యాలలో విశేషమైన కృషి చేసిన వారికి సత్కారం, ఏకపాత్రాభినయ పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవం, సాంస్కృతిక ప్రదర్శనల కార్యక్రమాన్ని గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ రామకృష్ణా నాట్యయండలి సేవలను కొనియాడారు. వివిధ రంగాలకు చెందిన గుత్తికొండ సుబ్బారావు, ముదిగొండ విశ్వేశ్వర శాస్త్రి, సాహితీవేత్త భవిష్య పాల్గొన్నారు. రామకృష్ణా నాట్యమండలి సహకార్యదర్శి జొన్నలగడ్డ ఆదిలక్ష్మి, కార్యదర్శి జొన్నలగడ్డ శ్రావణ్‌కుమార్ నిర్వహించారు. సాయిశంకర్ భారతీయుడు ఏకపాత్రాభినయం, కె. వాసుదేవరావ్ బృందం కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఏక పాత్రాభినయం పోటీలలో గెలుపొందిన వారికి నగదు బహుమతి అందజేశారు. రామకృష్ణా నాట్యమండలి స్వర్ణోత్స వేడుకల సందర్భంగా ప్రముఖ రంగస్థల నటులు, సాహితీవేత్త డాక్టర్ మీగడ రామలింగస్వామికి రంగస్థల దీప్తి పురస్కారం, సంగీత విద్వాంసుడు పోపూరి గౌరీనాథ్‌కు సంగీత దీప్తి , శతాధిక గ్రంథకర్త డాక్టర్ జీవీ పూర్ణచందుకు, సాహిత్య దీప్తి పురస్కారాలు ప్రదానం చేశారు.